క్లుప్తంగా

నూతన కార్యవర్గానికి అభినందన



నూతన పాలక వర్గ ప్రతినిధులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం: హిందుస్థాన్ పెట్రోలియం కాంట్రాక్ట్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ నూతన పాలక వర్గ సభ్యులను ప్రభుత్వ విప్ పి.గణబాబు అభినందించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ ప్రతినిధులు ఆదివారం ప్రభుత్వ విప్ గణబాబును ఆయన నివాసంలో కలిశారు. కార్మికుల సంక్షేమానికి నూతన పాలక వర్గ ప్రతినిధులు శ్రమించాలని గణబాబు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎం.ధనంజయ్‌రావు,ప్రధాన కార్యదర్శి సర్వసిద్ధి శ్రీనివాసరావుయాదవ్, ఉపాధ్యక్షుడు వై.అప్పలరాజుయాదవ్,కోశాధికారి వై.ఎ. భాస్కర్‌రావుయాదవ్,డైరెక్టర్లు చొప్ప అప్పలరాజుయాదవ్,చెల్లిబోయిన శ్రీనివాస్‌రావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

గురుద్వారాను సందర్శించిన పోలీస్ కమిషనర్



గురుద్వారా దర్బార్‌లో చిన్నారులకు ప్రసాదం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఉదయం సింధియా న్యూకాలనీలోని సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ మందిరమైన గురుద్వారా దర్బార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మత పెద్దల ఘన స్వాగతాన్ని అందుకున్నారు. మందిరంలో సిక్కులతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా దర్బార్‌లో భక్తులకు సీపీ శుభాకాంక్షలను తెలిపారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించి, వారికి చాక్లెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైనారిటీల సంరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. స్థానికంగా ఏ సమస్య వచ్చినా తక్షణం 79950 95799 నంబర్‌లో తనను సంప్రదించాలన్నారు. అనంతరం సిక్కు మత పెద్దలు సీపీ బాగ్చిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిక్కు మతస్తులు, మల్కాపురం పోలీస్ స్టేషన్ సీఐ గొలగాని అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో ప్రతిభ



బంగారు పతకం అందుకుంటున్న పుష్పలత

విశాఖ విద్య: యెగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో ఎన్ఏడీ ఏపీఎస్ఈబీ కాలనీకి చెందిన యోగా ట్రైనర్ సీలాపు పుష్పలత మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. నిర్వాహకులు ఆమెకు బంగారు పతకం, సర్టిఫికెట్ అందజేశారు.



రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో బ్రేక్ టైంలో..



ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయంలో విద్యార్థులు

ఆటల్లేవ్!

- ఆర్పీపేట ఉన్నత పాఠశాలకు పీఈటీ కరువాయే
- కొరవడుతున్న క్రమశిక్షణ
- కౌన్సెలింగ్ జరిగి 60 రోజులు గడిచినా కానరాని పీఈటీ



పీఈటీ లేక పోవడంతో గేటు వద్ద విద్యార్థులు

కంచరపాలెం: మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అటు ప్రజాప్రతినిధులు, ఇటు విద్యాశాఖాధికారులు ఉపన్యాసాలు ఇస్తుంటారు. విద్యార్థులకు క్రీడలను దూరం చేసి చదువు మాత్రమే అంటూ పాఠాలతో సరిపెడుతున్నారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలకు క్రీడా ఉపాధ్యాయుడిని నియమించలేదు. పాఠశాలలో విధులు నిర్వహించిన పీఈటీ మాధవధార ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిపోయారు. వాస్తవానికి ఒక పీఈటీ ఉన్నచోట వేరే ఉపాధ్యాయుడు వచ్చిన వరకూ బదిలీ అయిన ఉపాధ్యాయుడిని రిలీవ్ చేయకూడదు. అలాంటిది ఆర్పీపేట ఉన్నత పాఠశాలకు పీఈటీ రాకుండానే ఇక్కడి పీఈటీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రిలీవ్ చేసేశారు.

వికాసం లేదా...

విద్యాశాఖాధికారుల ఆదేశాలతో ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 'విద్యాశక్తి' పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు క్రీడలను దూరం చేస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడి పాఠశాలకు పీఈటీని నియమించాలని విద్యాశాఖాధికారులను కోరితే డీఎస్సీ భర్తీ తర్వాత కొత్త వ్యాయామ ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పుకొస్తున్నారు.

ప్రార్థనతోనే సరి

2025–26 విద్యా సంవత్సరం ప్రారంభించి **సుమారు 60 రోజులు** గడిచినా క్రీడా ఉపాధ్యాయుడు **లేకపోవడంతో** క్రీడలకు దూరంగా **విద్యనభ్యసిస్తున్నారు.** పాఠశాలలో సుమారు **750 మంది విద్యార్థులు 6వ** తరగతి నుంచి 10వ **తరగతి వరకు చదువుతు**న్నారు.. పాఠశాలలో **ఉదయం సమయంలో** హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు **ప్రార్థనల**తో సరిపెడుతున్నారు. **పీఈటీకి కేటాయించిన** టైం టేబుల్‌లో ఇతర **సబ్జెక్ట్ టీచర్లకు కేటాయిం**చడంతో పనిభారం **పెరుగుతుందని ఉపాధ్యాయులు** ఆవేదన వ్యక్తం **చేస్తున్నారు.**



పిక్కలతో ఆడుకుంటున్న విద్యార్థులు

పీఈటీ లేరు

నేను ఈ ఏడాది ఆరో తరగతిలో చేరాను. హైస్కూల్‌లో పీఈటీ టీచర్ ఉంటారు. ఆటలు బాగా ఆడిస్తారు. వ్యాయామం నేర్పుతారనుకున్నాను. స్కూల్‌కు వచ్చి రెండు నెలలు గడిచినా ఆటలు లేవు. మా ఫ్రెండ్స్ వారి పాఠశాలల్లో స్పోర్ట్స్ నేర్పిస్తారని చెబుతున్నారు. మాకు పీఈటీ కావాలి.
– **వై. భూమిక,** విద్యార్థిని, గౌరీనగర్, ఊర్వశికూడలి

తరగదుల్లోనే ఉంటున్నాం

మా పాఠశాలలో గతంలో సబ్జెక్ట్ టీచర్స్‌తో పాటు పీఈటీ ఉండేవారు. పీఈటీ డ్రిల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలు ఆడించేవారు.వ్యాయామ ఉపాధ్యాయుడికి బదిలీ కావడంతో టైంటేబుల్‌లో పీఈటీ పీరియడ్లు ఉన్నా టీచర్ రావడం లేదని వేరే టీచర్లు వస్తున్నారు. క్లాస్ రూమ్‌కే పరిమితి చేస్తున్నారు.
– **వర్షిత్‌కుమార్,** విద్యార్థి, ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం.

క్రీడలు భవిష్యత్తుకు పునాది

కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం అంటూ విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చెబుతున్నారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయనే నానుడి ఇక్కడి పాఠశాలలో కనిపించడం లేదు. విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతో పాఠశాలలో మా పిల్లలకు క్రీడలు దూరమతున్నాయి. చదువుతో పాటు ఆటలు ఆడితే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారు. – **ఎస్.రాంబాబు,** పేరెంట్, గాంధీనగర్, కంచరపాలెం

మోసం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- 57, 60 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



60వ వార్డు సభలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్



పాల్గొన్న కార్యకర్తలు,అభిమానులు

మల్కాపురం: ఎన్నికలప్పుడు ప్రజలకు ఇష్టం వచ్చినట్టు హామీలు వచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేయడం చంద్రబాబు నైజం అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. 60వ వార్డు ఇందిరాకాలనీలో వార్డు పార్టీ అధ్యక్షుడు వర్మ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బాబుష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా మళ్ల విజయప్రసాద్‌తో పాటు వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొన్నారు. మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఏ ప్రాంతానికి అయినా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుపై ఫ్రీగా తిరగవచ్చు అని ప్రచారం చేశారన్నారు. తీరా అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఇంత వరకూ అమలు చేయలేదు సరికదా.. నేడు..రేపు అంటూ కాలం వెళ్లదీయడంతో పాటు కొందరు జిల్లాకే ఉచితమని.. మరికొందరు రాష్ట్రం అంతా ఉచితం అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఉచిత గ్యాస్ డబ్బులు ఎంత మందికి వచ్చాయని సభలో పాల్గొన్న మహిళలను అడిగితే చాలా మంది తమకు రాలేదని చేతులు ఊపారు. ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ఆ పథకం అమలు చేస్తే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని చెప్పడం మహిళలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.నిరుద్యోగులకు ఉపాధి లేదు, నిరుద్యోగ భృతి లేదు..,తల్లికి వందనం అందరికీ కాకుండా కొంత మందికే పరిమితం చేసి పేదలకు అన్యాయం చేశారన్నారు.

అరాచక పాలన

ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, గంజాయి విచ్చల విడిగా దొరకుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోతుందని.. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని వివరించారు. కూటమి నాయకులు ప్రచారానికే పరిమితం అయి..,పాలనను గాలికి వదిలేశారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం గడుపుతున్నారన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తే సహించలేక తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని... హామీలు విస్మరించిన చంద్రబాబుకు సరైన సమయంలో బుద్ధి చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు గుంట సుందర్ రావు,హనుమంతురావు,ఉద్దా భాస్కరరావు,రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని చంద్రబాబును నిలదీద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు



57వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: రాష్ట్రంలోని ప్రజలంతా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో మోసపోయిన బాధితులేనని, ప్రతి ఒక్కరూ ఆయనను నిలదీసేందుకు అర్హులేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. పార్టీ 57వ వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు ఆధ్వర్యంలో ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెం కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తావని చెప్పిన కూటమి నాయకులు ఏడాది పాలనలో ఏవీ అమలు చేయలేక విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కేవలం ప్రచారం మాత్రం చేసుకుంటున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చి, ఇచ్చిన హామీలు కంటే ఎక్కువ పథకాలు అమలు చేసి గర్వంగా గడప గడపకు వెళ్లామని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వార్డులో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని మళ్ల విజయప్రసాద్ సూచించారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు శరగడం వెంకటలక్ష్మి, సావిత్రి, చిన్నారి, కళ, శ్రీను, డి.గోవిందం, అప్పు, గుణేష్, కె.ధనరాజ్, సిహెచ్.సూరిబాబు, సిహెచ్.రాంబాబు, ఎస్.బాబూరావు, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీను, అర్జున్, జయరామ్, జి.శ్యామ్, త్రినాథ్, సత్తిబాబు, భాస్కర్, మోహన్, మణి, అప్పలరాజు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు



బుచ్చిరాజుపాలెం డిపో వద్ద రేషన్ కోసం గుమిగూడిన లబ్ధిదారులు

విశాఖ విద్య: రేషన్ సరకులు తీసుకోవడానికి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.బియ్యం కోసం లబ్ధిదారులు డిపోల వద్ద గంటల తరబడి వేచి ఉండక తప్పడం లేదు. డీలర్లు ఇష్టమొచ్చినప్పుడే బియ్యం ఇస్తుండడంతో కార్డుదారులకు ఎదురుచూపులు మిగులుతున్నాయి. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం రేషన్ డిపో వద్ద ప్రస్తుతం ఇలాంటి సన్నివేశాలే కనిపిస్తున్నాయి. డిపో ఏర్పాటు చేసిన భవనంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గాలి,వెలుతురు లేని చోట గంటల తరబడి వేచి ఉండలేక అలసటకు గురవుతున్నారు. బియ్యం మూట పట్టుకొని డ్రైనేజీపై వేసిన బల్లపై రావాల్సి వస్తోంది. పొరపాటున కాలుజారితే డ్రైనేజీలో పడడం ఖాయమని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎన్ఏడీ సెంటర్‌లోని 52,90 వార్డుల్లోని అన్ని రేషన్ డిపోల వద్ద కార్డుదారులను అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. రేషన్ డిపోల వద్దబియ్యం పంపిణీ ఎలా జరుగుతుందోనని సివిల్ సప్లై అధికారులు లేకపోవడంతో లబ్ధిదారులకు ప్రతీ నెలా రేషన్ కష్టాలు తప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనంతో ఇంటి వద్దే బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందుకున్నామని, మాకు ఇప్పుడు ఇవేం కష్టాలని లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బల్లపై నుంచి దిగలేక మరో వ్యక్తి తోడుతో ఇలా..



తమ వంతు కోసం రోడ్డుపైనే వేచి చూస్తున్న వృద్ధులు

జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం



సీనియర్ పాత్రికేయుడిని అభినందిస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

మల్కాపురం: సమాజంలో చీకటి కోణాలను వెలుగులోకి తీసుకు వచ్చి పేదలకు పరోక్షంగా జర్నలిస్టులు అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం తొలి వార్షికోత్సవాన్ని ఆదివారం 59వ వార్డులోని సామాజిక భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజహితం కోసం పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో 40,60,62వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు,పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు,59వ వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, జర్నలిస్టు సంఘం అధ్యక్ష,కార్యదర్శులు ముప్పిడి గిరి,రాజుయాదవ్ పాల్గొన్నారు.

- అలాగే ప్రభుత్వ విప్ పి.గణబాబు, హార్బర్ ఏసీపీ కాళిదాసు,మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు,ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు తదితరులు జర్నలిస్టులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు రెడ్డి రామాలయానికి వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. అందరూ నడిచే దారిలో చేతికి వైర్లు తగిలేలా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి దీని నుంచి నిప్పు రవ్వలు పడుతుండటంతో అటుగా వెళ్లేందుకు భయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ట్రాన్స్ కో అధికారులు దృష్టి సారించి, రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగుపోయే దారేది?



కల్వర్టు వద్ద నిలిచిన మురుగు నీరు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే మార్గంలో యునైటెడ్ చర్చి సమీపంలోని కల్వర్టు వద్ద మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో ఇక్కడ దోమల కర్మాగారంగా తయారవుతోందని ఇక్కడ నివసించేవారు వాపోతున్నారు. గతంలో కాలువ వెడల్పుగా ఉండేది. ప్రస్తుతం వీధి కాల్వ కంటే చిన్నదిగా మారిపోయింది. కాల్వ జిరాయితీ స్థలంలో ఉందని కొందరు చెబుతున్నారు. వర్షాకాలంలో వరద నీరు దిగువకు దీని నుంచే వెళ్లేది. అయితే కాలువ ఉన్న స్థలం జిరాయితీది అని మట్టితో పూడ్చేశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు పలు మార్లు సర్వేలు చేశారు. వివరాలు వెల్లడించకుండా చేయకుండా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఈ కాల్వను మట్టితో కప్పేశారు. దీంతో కల్వర్టు వద్ద నీరు నిలిచిపోయింది. దుర్వాసన, దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీరు పోయే విధంగా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పెద్ద కాల్వ ఇలా...

అలరించిన వినోదాల విందు

తాటిచెట్లపాలెం: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు అలరించింది. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజ్, కుమారి, పుష్పమ రాగన్ నాయుడు, నరసింహారావు, సూర్య, ఎస్ఎస్ నాయుడు, పోర్ట్ శేషు లఘు నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శేఖర్ కుమార్ అందించిన హాస్య గుళికలు వినోదాన్ని పంచాయి. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.మాల్యాద్రి, రిటైర్డ్ డీజీఎం డాక్టర్ మీగడ శశిభూషణ, స్వామి తదతరులు పాల్గొన్నారు.